సాక్షి ప్రకాశం
బుధవారం | 15 | ఫిబ్రవరి | 2023



పశ్చిమాన రైలు జోరు

రైల్వే స్టేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయడంతో పాటు, లైన్ల విద్యుదీకరణ చేయనున్నారు. - 8లో..



గంజాయి వ్యాపారుల మూలాలు దెబ్బతీయాలి

జిల్లాలో గంజాయి తదితర మాదక ద్రవ్యాల వ్యాపారం చేస్తున్న వారి మూలాలు దెబ్బతీయాలని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
32 /20

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

25లోగా టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్ష ఫీజు ఈనెల 25వ తేదీలోపు చెల్లించాలని డీఈవో పి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్ వీవింగ్, టైలరింగ్ ఎండ్ ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఏప్రిల్‌లో జరుగుతాయన్నారు. లోయర్ గ్రేడ్ పరీక్షలకు 7వ తరగతి పాస్ అయిన వారు, హయ్యర్ గ్రేడ్ పరీక్షలకు లోయర్ గ్రేడ్ పరీక్షలు ఉత్తీర్ణులు అయినవారు అర్హులన్నారు. పరీక్షలు రాయదలచిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా కార్యాలయ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అనంతరం దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. డ్రాయింగ్ లోయర్ రూ.100, హయ్యర్ రూ.150, హ్యాండ్‌లూమ్ వీవింగ్ లోయర్ రూ.150, హయ్యర్ రూ.200, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ లోయర్ రూ.150, హయ్యర్ రూ.200 పరీక్ష ఫీజును ఈనెల 25వ తేదీలోగా ఎటువంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చన్నారు. మార్చి 3వ తేదీలోపు రూ.50, మార్చి 10వ తేదీలోపు రూ.75 అదనపు రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

వీఆర్‌కు రూరల్ సీఐ..?

ఒంగోలు టౌన్: ఒంగోలు రూరల్ సీఐ శివరామకృష్ణా రెడ్డిని వీఆర్‌కు పంపించినట్లు సమాచారం. ఈనెల 6వ తేదీన ఆయన రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. అయితే వారం రోజులు కూడా తిరక్కుండానే ఆయనకు గుంటూరు రేంజి కార్యాలయం నుంచి పిలుపురావడం చర్చనీయాంశమైంది. శివరామకృష్ణారెడ్డి స్థానంలో సింగరాయకొండ సీఐ రంగనాథ్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

నిమ్మలో సస్యరక్షణ చేపట్టాలి

- ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ భాస్కర్



నిమ్మ రైతుల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ విజయభాస్కర్

ఒంగోలు సబర్బన్: నిమ్మ తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ శాస్త్రవేత్త డాక్టర్ విజయ భాస్కర్ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ఉద్యాన శిక్షణ సంస్థలో మంగళవారం నిమ్మ, బత్తాయి ఎఫ్‌పీఓ రైతులకు ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉద్యాన శాస్త్రవేత్త విజయ భాస్కర్ మాట్లాడుతూ బత్తాయి, నిమ్మ సాగు చేస్తున్న రైతులు కొన్ని మెళకువలు పాటించాలన్నారు. ప్రస్తుతం నిమ్మ తోటలు పిందె, కాయ పెరిగే దశలో ఉన్నాయన్నారు. ఈ పంటలను ఆశించే రాత్రి వేళల్లో పక్వానికి వచ్చిన కాయల నుంచి రసం పీల్చే పురుగుల నివారణకు రైతులు పాటించాల్సిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులను వివరించారు. అదేవిధంగా కొమ్మ కత్తిరింపులు ఎలా చేయాలి అన్న అంశంపై వివరించారు. కాయ నాణ్యతను దెబ్బతీసే త్రిప్స్, మంగు నల్లి నుంచి పంటను రక్షించుకోవాలని పేర్కొన్నారు. ఈ రెండు రకాల పురుగులను నివారించటానికి ఒక లీటరు నీటికి 1.6 మిల్లీ లీటర్ల మోనో క్రోటో ఫాస్ ప్లస్ 1.5 గ్రాముల థయోవిట్‌ను పిచికారి చేయాలన్నారు. వారం రోజుల తరువాత లీటరు నీటికి 2 మి.లీ ఒమైట్‌ను పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి వై.గోపీచంద్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆవశ్యకత, రైతులకు కలిగే ప్రయోజనాల గురించి చెప్పారు. ప్రతి ఉద్యాన రైతు డ్రిప్ పద్ధతి ద్వారా నీరు, నీటిలో కరిగే రసాయనిక ఎరువులు వాడాలని, ఉద్యాన శాఖ ద్వారా లభించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యాన శిక్షణ కేంద్రం ప్రిన్స్‌పల్ ఎం.శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఉద్యాన శాఖలో చేపట్టే వివిధ పథకాలను వివరించి బత్తాయి, నిమ్మ రైతులు నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. శిక్షణకు యర్రగొండపాలెం, మార్కాపురం, కంభం మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.


18న రామాపురంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు

రాచర్ల: మండలంలోని గుడిమెట్ట పంచాయతీ పరిధిలోని రామాపురం సమీపంలోని సిద్ధిభైరవేశ్వరస్వామి మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా ఈ నెల 18న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు రామాపురం సొసైటీ అధ్యక్షుడు, దేవస్థానం ధర్మకర్త మదిరె శ్రీరంగారెడ్డి, ఉప ధర్మకర్త శ్రీరంగపు వెంకట నారాయణరెడ్డి తెలిపారు. ఆసక్తి కలిగిన ఎడ్ల యజమానులు రూ.500 ప్రవేశం రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.30 వేలు, మూడో బహుమతిగా రూ.15, నాల్గవ బహుమతిగా రూ.5 వేలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9903970858, 8008974886 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కృష్ణమ్మ పరుగుకు వేళాయె..!

కనిగిరి నియోజకవర్గంలో కృష్ణమ్మ పరుగులు పెట్టనుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించి నియోజకవర్గానికి రెండు భారీ నీటి పథకాలను కేటాయించారు. ఫ్లోరైడ్ పీడిత ప్రాంతంగా ఉన్న నియోజకవర్గంలో సురక్షిత జలాలు పరుగులు తీసేలా రూ.530 కోట్లు కేటాయించారు. ప్రజలు పడుతున్న కష్టాలను పలు మార్లు సీఎం దృష్టికి తీసుకెళ్లి భారీగా నిధులు తీసుకొచ్చేలా ఎమ్మెల్యే బుర్రామధుసూదన్ యాదవ్ సఫలీకృతులయ్యారు. కనిగిరి పట్టణంలో చేపట్టిన మంచినీటి ప్రాజెక్టు పనులు జోరందుకున్నాయి.

- రూ.530 కోట్లతో మంచినీటి పథకాలు
- రూ.130 కోట్లతో కనిగిరి పట్టణానికి సురక్షిత జలాలు
- రూ.400 కోట్లతో వాటర్ గ్రిడ్
- పూర్తి కావస్తున్న సర్వే



గొట్టిపడియ వద్ద నిర్మిస్తున్న పశ్చిమ ప్రకాశం వాటర్ గ్రిడ్ స్కీం ఇన్‌టెక్‌వెల్

- ఫ్లోరైడ్ రక్కసి నుంచి విముక్తి
- కనిగిరి నియోజకవర్గానికి సీఎం జగన్ వరాల జల్లు
- సురక్షిత జలాల కోసం ఫలించిన ఎమ్మెల్యే బుర్రా యత్నాలు

కనిగిరి రూరల్: ఒకప్పుడు కనిగిరి నియోజకవర్గం కరువుకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. ఫ్లోరైడ్ సమస్యతో ప్రజలు అవస్థలు పడేవారు. కిడ్నీ సమస్యలతో ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ ఉన్నాయి. గత పాలకులు ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. వీరి బాధలను గత తెలుగుదేశ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాల్లేవు. కేవలం బూటక ప్రకటనలకే పరిమితమయ్యారు. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్రలో భాగంగా నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా కిడ్నీ, ఫ్లోరోసిస్ బాధితులతో మాట్లాడారు. వారు పడుతున్న బాధలు నేరుగా తెలుసుకున్నారు. అధికారంలోకి వచ్చాక న్యాయం చేస్తానని వారికి జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ నియోజకవర్గ ప్రజలు పడుతున్న కష్టాలను సీఎంకు విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఎం రెండు రక్షిత నీటి పథకాలను మంజూరు చేశారు.



కనిగిరి సమగ్ర నీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ (ఫైల్)

పథకాల తొలి అడుగులు ప్రారంభం

కనిగిరి పట్టణ సమగ్ర మంచినీటి పథకానికి రూ.130 కోట్లు మంజూరు చేశారు. ఈ పథకానికి మంత్రి, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌లు భూమి పూజలు చేసి పనులు ప్రారంభించారు. రామతీర్థం ప్రాజెక్టు నుంచి వచ్చే పైప్‌లైన్‌తో చల్లగిరిగిల కొండపై ప్రధాన ట్యాంక్, పట్టణంలోని మూడు ప్రదేశాల్లో ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లు నిర్మించి 20 వార్డుల్లోని ప్రతి ఇంటికి సాగర్ నల్లా ఇచ్చి రక్షిత తాగునీటి జలాలు ప్రజలకు అందించనున్నారు. ఈమేరకు ప్రాజెక్టు పనులు తొలి అడుగులు పడి ఎర్త్ వర్క్, పైప్ లైన్ వర్క్ పనులు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.

వాటర్ గ్రిడ్ పథకానికి రూ.400 కోట్లు

సుమారు రూ.400 కోట్లతో కనిగిరి నియోజకవర్గ పరిధి ఆరు మండలాల్లోని 442 గ్రామాలకు సురక్షిత జలాలు పరుగులు తీయనున్నాయి. వెలిగొండ ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈమేరకు జనవరిలో అగ్రిమెంట్ జరిగినట్లు అధికారులు వివరించారు. కనిగిరి ఆరు మండలాల్లో సుమారు వెయ్యి కి.మీ మేర పైప్‌లైన్ ద్వారా వెలిగొండ గొట్టిపడియ గ్యాప్ (కొండ) నుంచి వెలిగొండ జలాలు పంపింగ్ జరగనున్నాయి. ఇప్పటికే పైప్‌లైన్ మ్యాపింగ్, సర్వే పనులు ప్రారంభమయ్యాయి. ఈ నెలాఖరులోపు కనిగిరిలో పైప్‌లైన్ లెవలింగ్ సర్వే పూర్తి కానున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ వాటర్ గ్రిడ్ పథకంలో ప్రతి గ్రామానికి సురక్షిత జలాలు ఇవ్వనున్నారు.



ప్రతిపక్ష నాయకుడిగా ఫ్లోరైడ్ బాధితులతో మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి (ఫైల్)

పైప్‌లైన్ ఇలా...

- గొట్టిపడియ నుంచి కనిగిరికి పైప్‌లైన్ మార్కాపురం బైపాస్, మెడికల్ కాలేజీ, ఎన్‌హెచ్ 565 హైవే మీదుగా మార్కాపురం మైన్స్ క్వారీ కొండ పైన ఎక్కిస్తారు. అక్కడ 1200 కేఎల్ (బీపీటీ) బ్రేక్ ప్రజర్ ట్యాంక్ నిర్మిస్తారు.
- అక్కడి నుంచి రాయవరం సంప్‌నకు (మార్కాపురం గ్రామల ప్రజలకు) ఎక్కిస్తారు.
- రెండో లైన్‌తో తర్లుపాడు మండలానికి పంపింగ్ చేస్తారు.
- మూడో లైన్‌తో కొనకనమిట్ల, హెచ్‌ఎంపాడు మండలాలకు పంపింగ్ చేస్తారు.
- నాల్గవ లైన్ ద్వారా పూర్తిగా కనిగిరి నియోజకవర్గంలోని మండలాలకు పంపింగ్ జరుగుతుంది. కనిగిరి నియోజకవర్గ ప్రధాన పైప్‌లైన్ బైపాస్ పక్క నుంచి (ఒక చీలిక లైన్) చినారికట్ల జంక్షన్ వద్ద కొండపైకి ఎక్కిస్తారు. అక్కడ 90 కేఎల్ (కిలో లీటర్) ట్యాంక్ నిర్మిస్తారు. దాని నుంచి పొదిలి మండల గ్రామాలకు నీరు సరఫరా చేస్తారు.
- అదే ప్రధాన లైన్ నుంచి నందనమారెళ్ల కొండ పైకి ఎక్కిస్తారు. అక్కడ 900 కేఎల్ ట్యాంక్ నిర్మిస్తారు. నందనమారెళ్ల ప్రధాన ట్యాంక్ నుంచి నందనమారెళ్ల, దిరిశవంచ, కమ్మవారిపల్లి, ఎడవల్లి రైల్వే ట్రాక్ పక్క నుంచి పునుగోడు సంప్‌లకు నీరు డంప్ చేస్తారు. అక్కడి నుంచి కనిగిరి మండలంలోని కొన్ని గ్రామాలకు, పీసీపల్లి మండలంలోని 33 గ్రామాలకు నీరు సరఫరా చేస్తారు.
- రెండో లైన్ నందనమారెళ్ల, చల్లగిరిగిల్ల, నడింపల్లి, శ్రీరంగపురం, చాకిరాల, గొల్లపల్లి వద్దకు చేరుతుంది. అక్కడ గొల్లపల్లిలో 2,250 కేఎల్ ట్యాంక్ నిర్మిస్తారు.
- అక్కడి నుంచి కనిగిరి మండలంలోని కొన్ని గ్రామాలకు, వెలిగండ్ల, సీఎస్‌పురం, పామూరు మండలాలకు వెళ్తాయి. పామూరు మండలం గుండ్లకొండ దగ్గర 90 కేఎల్ ట్యాంక్ నిర్మించి, అక్కడి నుంచి పీసీపల్లిలోని పెద ఇర్లపాడు తదితర 30 గ్రామాలకు వాటర్ సరఫరా చేస్తారు.
- కనిగిరి నియోజకవర్గంలో మొత్తం సుమారు వెయ్యి కి.మీ పైప్‌లైన్ నిర్మిస్తారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటా



నియోజకవర్గ ప్రజలకు ఫ్లోరైడ్ నీటి నుంచి విముక్తి కలిగించి, రక్షిత జలాలు అందించాలని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విన్నవించా. కనిగిరి పట్టణానికి రూ.130 కోట్లు, సమగ్ర మంచి నీటి పథకం ద్వారా నియోజకవర్గానికి సుమారు రూ.400 కోట్లు మంజూరు చేశారు. ఈ రెండు పథకాలతో కనిగిరిలో ప్రతి ఒక్కరికీ సురక్షిత జలాలు అందుతాయి. ఫ్లోరైడ్, కిడ్నీ బాధితుల సమస్య తీరుతుంది. తాను, నియోజకవర్గ ప్రజలు జీవితాంతం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. త్వరలో సీఎంను కనిగిరికి తీసుకొచ్చి వాటర్ గ్రిడ్ పథకానికి శంకుస్థాపన చేయిస్తా.

– బుర్రా మధుసూదన్ యాదవ్, ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు.

నెలాఖరుకు సర్వే పూర్తి



జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో వాటర్ గ్రిడ్ పథకం సర్వే మ్యాపింగ్ చేశాం. ఈ మేరకు కంపెనీ ప్రతినిధులు పైప్‌లైన్ నిర్మాణ సర్వే లెవలింగ్ చేస్తున్నారు. మొత్తం 2,800 కి.మీ పొడవునా పైప్‌లైన్‌కు 1,400 కి.మీ పొడవున సర్వే పూర్తయింది. సుమారు 60 నుంచి 70 మంది సర్వే చేస్తున్నారు. నెలాఖరులో సర్వే పూర్తి చేయాలని ఆదేశాలున్నాయి. ఇప్పటికి కనిగిరిలో సుమారు 400 కి.మీ దూరం పూర్తి చేశాం. రూ.1,290 కోట్ల వాటర్ గ్రిడ్ పథకం ఎర్త్ వర్క్ పనులు మే నెలలో ప్రారంభమవుతాయి.

– ప్రతాప్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, కనిగిరి

సదా మీ సేవలో.. ఆర్టీసీ

- ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు
- ఒకేసారి ప్రయాణ, దైవ దర్శనం టికెట్లు పొందే అవకాశం
- స్పెషల్ బస్సుల్లోనూ సాధారణ చార్జీలే..
- మహా శివరాత్రి సందర్భంగా ప్రయాణికులు, భక్తులకు ఆర్టీసీ తీపి కబురు
- పెద్దదోర్నాలలో బస్టాండ్ స్థలాన్ని పరిశీలించిన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



బస్టాండ్ నిర్మాణానికి కేటాయించిన స్థలం మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైలం వచ్చే ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. పెద్దదోర్నాల మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్‌కు నూతనంగా సమకూరిన 51 సెంట్ల స్థలాన్ని ఆయన మంగళవారం పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీశైలానికి పెద్దదోర్నాల గేట్‌వే లాంటిదని, రాయలసీమ, కోస్తా ప్రాంతాలను కలిపే అత్యంత ముఖ్య ప్రాంతమని అభిప్రాయపడ్డారు. పెద్దదోర్నాల మీదుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు దాదాపు 200 బస్సు సర్వీసులు వెళ్తున్నాయన్నారు. గతంలో బీఓటీ ప్రాజెక్టు కింద పెద్దదోర్నాల బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలనుకున్నా, కొన్ని అనివార్య కారణాల వల్ల అది సాధ్యపడలేదని చెప్పారు. రెండు రోజుల క్రితం కలెక్టర్ 51 సెంట్ల స్థలాన్ని కేటాయించారని తెలిపారు. గతంలో ఉన్న 48 సెంట్లతోపాటు అదనంగా కేటాయించిన 51 సెంట్లలో బస్టాండ్‌ను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్ కోరిక మేరకు ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా మంచి నీరు, క్యాంటీన్, బుక్ షాప్ తదితర సౌకర్యాలు కల్పించి, వీలైనంత త్వరగా బస్టాండ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు.

చార్జీల పెంపు లేదు

డీజిల్ సెస్ వల్ల కొన్ని ధరలు పెరిగినప్పటికీ, ఆర్టీసీ బస్సుల్లో మాత్రం ప్రస్తుతం ఏ రేట్లు ఉన్నాయో అవే కొనసాగుతాయని ఆర్టీసీ ఎండీ స్పష్టం చేశారు. మహాశివరాత్రి సందర్భంగా నడిపే స్పెషల్ బస్సుల్లోనూ టికెట్ ధరలు పెంచడం లేదని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులు ప్రయాణ టికెట్‌తోపాటు దైవదర్శనం టికెట్లు కూడా పొందవచ్చని పేర్కొన్నారు. శీఘ్ర దర్శనం టికెక్ రూ.150, అతి శీఘ్ర దర్శనం టికెట్ రూ.300, స్పెషల్ దర్శనం టికెట్ రూ.500 చెల్లించి ఆర్టీసీ వెబ్‌సైట్‌లోనే తీసుకోవచ్చన్నారు. త్వరలోనే సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, కాణిపాకం, శ్రీకాళహస్తి ఆలయాలకు వెళ్లే భక్తులకు ఈ అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. అనంతరం దోర్నాలలో ఆయన ఆత్మీయులు వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, అబ్దుల్ కరీం సోదరులతో ముచ్చటించారు. కార్యక్రమంలో జోనల్ ఈడీ కె.ఆదాంసాహెబ్, కడప ఈడీ గోపీనాథ్‌రెడ్డి, ఒంగోల్ ఆర్‌ఎం సుధాకర్, మార్కాపురం డిపో మేనేజర్ నర్సింహులుతోపాటు స్థానిక నాయకులు తంగిరాల రామిరెడ్డి, గంటా గురవారెడ్డి, చిట్యాల యోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు





మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

- ఉపాధి హామీ పథకం సజావుగా అమలు చేయాలి
- కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఉపాధి హామీ పథకాన్ని సజావుగా అమలు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో మంగళవారం వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మస్టర్ల నమోదు, వేతనాల విషయంలో నిబంధనల ప్రకారం చేయాలన్నారు. జగనన్న లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరగాలన్నారు. ఉగాది నాటికి లక్ష్యాన్ని చేరుకునేలా చూడాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో పురోగతి తెలిసేలా ప్రతిరోజు జిల్లా కేంద్రానికి ఫొటోలు పంపాలన్నారు. ప్రభుత్వ సేవలకు సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించి ఈకేవైసీ వేగంగా పూర్తిచేయాలని సూచించారు. జగనన్న తోడు లబ్ధిదారులకు బ్యాంకు నుంచి రుణాలు అందించడంలో అలసత్వం వహించరాదన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇప్పటి వరకు అనుమతులు పొందిన నిర్మాణ పనులను ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలన్నారు. మండల స్థాయి స్పెషల్ అధికారులు నిర్మాణాల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. జగనన్న పాల వెల్లువ పథకంలో మరింత మంది పాడి రైతులు అమూల్ సంస్థకు పాలు పోసేలా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ పేరయ్య, సీపీవో వెంకటేశ్వర్లు, డీఈఓ రమేష్, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి ఉషారాణి, పశుసంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, పీఈఓ సామా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలకు పునాది వేసిన దామోదరం

ఒంగోలు టౌన్: కాకిలా పద్నాలుగు ఏళ్లు పరిపాలించడం కాదు హంసలా రెండేళ్లు పరిపాలించినా రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటుపడిన నాయకుడు దామోదరం సంజీవయ్య అని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకరావు అన్నారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 103వ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పద్నాలుగేళ్లు పరిపాలించినట్లు చెప్పుకుంటున్న వారు ఈ రాష్ట్రానికి చేసిందేమిటో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నో సంస్కరణలు చేపట్టిన ఆయన రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఆరు లక్షల ఎకరాల భూములను పంచిపెట్టిన దామోదరం సంజీవయ్య నేటి తరం నాయకులకు స్ఫూర్తిగా నిలిచారని పీజే గాంధీ అన్నారు. సభకు లెమ్యూల్ రాజు అధ్యక్షత వహించారు. పీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాష్, యాదల రాజశేఖర్, కరవది సుబ్బారావు, టి.ప్రభాకర్, జాషువా, పేరయ్య, సేవానేస్తం ప్రెసిడెంట్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వితంతువులు, వృద్ధులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. దామోదరం సంజీవయ్య విగ్రహ కమిటీ కన్వీనర్ యాదాల అరుణ్ కుమార్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

రైల్వే ఓవర్ బ్రిడ్జి రూట్ మ్యాప్ పరిశీలన

కొత్తపట్నం: సూరారెడ్డిపాలెం–ఈతముక్కల గ్రామాల మధ్య రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదిత స్థలం వద్ద మంగళవారం విజయవాడ నుంచి ఎస్‌సీఆర్ సౌత్ సెంట్రల్, ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించారు. గతి శక్తి స్కీమ్ ద్వారా 100 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులతో ప్రతిపాదనలు పంపించేందుకు రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి చొరవతో రైల్వే శాఖ మంత్రికి ప్రతిపాదనలు పంపించారు. ఏడీఈఎన్ సౌత్ సెంట్రల్ రైల్వే గతిశక్తి అధికారి గౌతమ్ మాట్లాడుతూ స్థలం, ఇతర పనులను మాత్రం రాష్ట్ర ప్రభుత్వం చూసుకోవాల్సి ఉంటుందన్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే సూరారెడ్డిపాలెం, సంకువారిగుంట, ఈతముక్కల, మడనూరు, రాజుపాలెం గ్రామాలకు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉంటుందన్నారు. ఏసీఆర్ ఏడీఈ ఎస్.జగదీశ్, ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీకాంత్, టంగుటూరు విద్యుత్ ఏఈ ఎం.వంశీకృష్ణ, సూరారెడ్డిపాలెం వీఏవో మధు, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, టి.సుధాకర్, దుగ్గిరాల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బ్రిడ్జి ప్రతిపాదిత పనులు పరిశీలిస్తున్న రైల్వే, ఆర్‌అండ్‌బీ అధికారులు

క్లుప్తంగా

చికిత్స పొందుతూ మహిళ మృతి



నూతలపాటి మంగమ్మ(ఫైల్)

పొన్నలూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ ఒంగోలు జీజీహెచ్‌లో సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వెంకుపాలెం గ్రామానికి చెందిన నూతలపాటి మాలకొండయ్య, మంగమ్మ భార్యాభర్తలు. భర్త రోజూ మద్యం సేవిస్తూ కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో మంగమ్మ పలుమార్లు వారించింది. అయినా భర్త తీరులో ఎలాంటి మార్పు లేకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 8న ఎలుకల మందు తిన్నది. బంధువులు గమనించి కె.అగ్రహారంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. రెండు రోజుల చికిత్స అనంతరం ఆమెను ఇంటికి తీసుకొచ్చారు. అయితే ఎలుకల మందు ప్రభావం వల్ల సోమవారం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. జీజీహెచ్ ఔట్‌పోస్ట్ పోలీసుల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాసరి రాజారావు తెలిపారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు



చరణ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

తర్లుపాడు: ఇంటి నుంచి సైకిల్ కోసం వెళ్లిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ముక్కంటి తెలిపారు. వివరాలు.. కొనకనమిట్ల మండలం గార్లదిన్నె గ్రామానికి చెందిన సానికొమ్ము రమణారెడ్డి కుమారుడు చరణ్‌కుమార్‌రెడ్డి తర్లుపాడు మండలం కలుజువ్వలపాడులో అవ్వా తాతల వద్ద ఉండి జెడ్పీ హైస్కూల్లో 7వ తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం సైకిల్ కోసం బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ముక్కంటి తెలిపారు.

క్రీడా పోటీలకు భూపతిపల్లి విద్యార్థుల ఎంపిక



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

మార్కాపురం: చిత్తూరు జిల్లా నగరిలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో మండలంలోని భూపతిపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం తోట రామకృష్ణ, పీఈటీ వై.బాలగురవయ్య తెలిపారు. ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-17 కబడ్డీ బాలికల విభాగంలో సానికొమ్ము కల్పన, టి.నందిని, ఎస్.కాశీశ్వరి, అండర్-14 విభాగంలో గాయం శిరీష, బాలుర విభాగంలో సానికొమ్ము మల్లికార్జునరెడ్డి, గౌతమ్‌లు ఎంపికైనట్లు తెలిపారు. రగ్బీ క్రీడలో అండర్-11లో ప్రసన్న లక్ష్మి, కె.కార్తీక్‌లు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పశ్చిమాన రైలు జోరు..

పశ్చిమ ప్రకాశంలో రైలు వేగంగా పరిగెత్తనుంది. గుంటూరు–గుంతకల్లు రైల్వే లైను డబ్లింగ్, విద్యుదీకరణకు కేంద్రం భారీగా నిధులు కేటాయించింది. అలాగే నడికుడి–శ్రీకాళహస్తి లైనుకు సంబంధించి కూడా నిధులు ఇవ్వడంతో పనులు జోరందుకోనున్నాయి. ఈ రెండు పనులు పూర్తయితే ఈ రూట్లో కొత్త రైళ్ల రాకతోపాటు వాణిజ్యపరంగా అభివృద్ధి చెందే అవకాశాలు మెండుగా ఉన్నాయి. తక్కువ ఖర్చుతో సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగించవచ్చు. అలాగే నాలుగు రైల్వే స్టేషన్లలో అత్యాధునిక వసతులు అందుబాటులోకి రానున్నాయి.

- రూపురేఖలు మారనున్న రైల్వే స్టేషన్లు
- రైల్వే బడ్జెట్‌లో 16 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రూ.170 కోట్లు
- గుంటూరు–గుంతకల్ రైల్వే లైన్ డబ్లింగ్‌కు రూ.980 కోట్లు
- నడికుడి–శ్రీకాళహస్తి మార్గానికి రూ.202 కోట్లు కేటాయింపు



రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం

మార్కాపురం: పశ్చిమప్రకాశం మీదుగా కోస్తా–రాయలసీమను కలిపే రైల్వేలైన్ల అభివృద్ధికి కేంద్రం బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యతనిచ్చింది. గుంటూరు–గుంతకల్లు, నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్లకు సుమారు రూ.1200 కోట్లు కేటాయించింది. అలాగే గుంటూరు డివిజన్ పరిధిలో 16 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రూ.170 కోట్లు కేటాయించింది. అందులో మన జిల్లాలో నాలుగు స్టేషన్ల అభివృద్ధికి రూ.40 కోట్లు కేటాయించింది. గుంటూరు–గుంతకల్లు రైల్వే లైన్ డబ్లింగ్ పనులు 2016–2017లో ప్రారంభమయ్యాయి. మొత్తం 404 కిలోమీటర్ల దూరాన్ని డబ్లింగ్ చేసేందుకు, విద్యుదీకరణ చేసేందుకు 3631 కోట్ల రూపాయలు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇప్పటి 159 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులు, విద్యుదీకరణ పూర్తి చేశారు. నల్లపాడు నుంచి సాతులూరు, చీకటీగలపాలెం నుంచి దొనకొండ, మార్కాపురం మీదుగా తర్లుపాడు వరకు, కర్నూల్ జిల్లాలో డోన్ నుంచి ఎద్దులదొడ్డి వరకు పూర్తి చేశారు. నల్లపాడు నుంచి దొనకొండ వరకు గుంటూరు డివిజన్ అధికారులు, దొనకొండ నుంచి నంద్యాల వరకు సికింద్రాబాద్ రైల్వే డివిజన్ అధికారులు, నంద్యాల నుంచి గుంతకల్లు వరకు గుంటూరు డివిజన్ అధికారులు పనులు చేశారు. మిగిలిన పనులు పూర్తికి ఈ బడ్జెట్‌లో రూ.980 కోట్లు కేటాయించింది.



మార్కాపురం రైల్వే స్టేషన్

నడికుడి-శ్రీకాళహస్తి మార్గానికి రూ.202 కోట్లు

కోస్తా నుంచి రాయలసీమ ప్రాంతానికి త్వరగా రాకపోకలు సాగించేందుకు వాణిజ్య, వ్యాపార పెరిగేందుకు వీలుగా నిర్మిస్తున్న నడికుడి–శ్రీకాళహస్తి రైలు మార్గానికి ఈ బడ్జెట్‌లో రూ.202 కోట్లు కేటాయించింది. ఇప్పటికే ఈ రైలు మార్గం పరిధిలో దాదాపు భూ సేకరణ వేగంగా సాగుతోంది. 2011–2012లో ఈ రైలు మార్గానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కేంద్రం 50 శాతం రాష్ట్రం 50 శాతం నిధులతో నిర్మిస్తున్నారు. తొలి దశలో శావల్యాపురం, పిడుగురాళ్ల మధ్య 45.50 కిలోమీటర్లు, రెండో దశలో గుండ్లకమ్మ, దర్శి, వెంకటగిరి మధ్య 41.95 కిలోమీటర్లు, మూడో దశలో దర్శి, కనిగిరి, ఆల్తూరిపాడు–వెంకటాపురం మధ్య 95.55 కిలోమీటర్లు, నాలుగో దశలో కనిగిరి–వెంకటాపురం మధ్య 126.16 కిలోమీటర్ల రైలు మార్గం నిర్మించనున్నారు. వీటి మధ్యలో 28 ఆర్‌ఓబీలు 144 ఆర్‌యూబీలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే శావల్యాపురం–పిడుగురాళ్ల మధ్య పనులు చివరిదశలో ఉన్నాయి. పొదిలి ప్రాంతంలో భూ సేకరణ ప్రక్రియ త్వరలోనే పూర్తికానుంది.

ఇవీ ఉపయోగాలు

గుంటూరు, నంద్యాల మధ్య రెండో ట్రాక్ విద్యుదీకరణ పూర్తయితే నూతన రైళ్లు రానున్నాయి. కోస్తా నుంచి రాయలసీమతోపాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు కూడా తక్కువ చార్జీలతో రాకపోకలు సాగించవచ్చు. వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతుంది. గుంటూరు, నంద్యాల మీదుగా చైన్నె ముంబయికి రైల్వే కనెక్టివిటీ ఏర్పాటు చేయొచ్చు.

అన్ని స్టేషన్లలో మౌలిక వసతులు



ఈ బడ్జెట్‌లో ఎంపిక చేసిన రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ. 10 కోట్ల చొప్పున కేటాయించింది. ఒక్కో స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన కనీస సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. స్టేషన్లలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, ఎస్కలేటర్లు, వాటర్ ఫేసిలిటీ, వెయిటింగ్ హాల్స్ నిర్మిస్తారు.

– ఆర్‌కేజే నరసింహం డీఆర్‌యూసీసీ మెంబర్ గుంటూరు రైల్వే డివిజన్

రైల్వే స్టేషన్ల అభివృద్ధి

గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో 16 స్టేషన్లలో అభివృద్ధి పనులకు రూ.170 కోట్లు కేటాయించింది. ఇందులో ఒక్క గుంటూరు స్టేషన్‌కే రూ.20 కోట్లు కేటాయించగా మిగిలిన 15 స్టేషన్లకు రూ.10 కోట్ల చొప్పున మొత్తం రూ.150 కోట్లు ఖర్చు చేయనున్నారు. స్టేషన్లలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లల కోసం లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఎల్‌ఈడీ బల్బులు, ఎలక్ట్రిక్ డిస్‌ప్లే బోర్డులు, ప్లాట్‌ఫాంల విస్తరణ, అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థ, లెవెల్ క్రాసింగ్ ప్రాంతాల్లో రోడ్ అండర్ బ్రిడ్జిలు, ప్రయాణికులు కూర్చునేందుకు బెంచీలు, నీటి సౌకర్యం, వెయిటింగ్ హాల్స్ నిర్మించేందుకు నిధులు వెచ్చించనున్నారు. జిల్లాలో మార్కాపురం, గిద్దలూరు, కంభం, దొనకొండ రైల్వేస్టేషన్లను రూ.40 కోట్లతో అభివృద్ధి చేస్తారు.



గంజాయి వ్యాపారుల మూలాలు దెబ్బతీయాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

- ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: జిల్లాలో గంజాయి తదితర మాదక ద్రవ్యాల వ్యాపారం చేస్తున్న వారి మూలాలు పసిగట్టాలని, గంజాయి వంటి నార్కోటిక్స్ ఆనవాళ్లు లేకుండా చేయాలని ఎస్పీ మలికా గర్గ్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సెబ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి, నాటుసారా, ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న అక్రమ మద్యం, ఇసుక, నాటుసారా తయారీ క్రయ విక్రయాలపై చేపట్టిన చర్యల గురించి ఆరా తీశారు. పీడీ యాక్ట్ కేసులు, ప్రత్యామ్నాయ జీవనోపాధి, బైండోవర్ కేసుల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో గంజాయి వ్యాపారుల మూలలను పసిగట్టి వాటి ఆనవాళ్లు లేకుండా చేయడానికి అవసరమైన చర్యలను తీసుకోవాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలను వదిలపెట్టవద్దని కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాటుసారా తయారీ కేంద్రాలపై నిఘా పటిష్టం చేయాలని, పోలీసులు, సెబ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించాలని సూచించారు. నాటుసారా తయారీకి అలవాటు పడినవారు ఆ వృత్తి మానుకునేలా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపాలని చెప్పారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను వేలం వేయాలన్నారు.

ప్రత్యేక కార్యాచరణతో సమన్వయ కృషి

జిల్లాలో రెడ్‌జోన్లుగా ఉన్న మూడు గ్రామాలను నాటుసారా రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని ఎస్పీ చెప్పారు. జిల్లాను నాటుసారా, గంజాయి రహితంగా మార్చేందుకు పోలీసు, సెబ్ శాఖలు ప్రత్యేక కార్యాచరణతో వెళుతున్నట్లు తెలిపారు. ఎవరైనా నాటుసారా తయారీ చేస్తున్నా, గంజాయి విక్రయిస్తున్నా, సేవిస్తున్నట్టు సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 14500 లేదా 100,112 కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, సెబ్ ఈఎస్ ఏ.ఆవులయ్య, సెబ్ అధికారులు శ్రీనివాసనాయుడు, సీఐ వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుబ్బరాజు

కొమరోలు: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని పి.పాట్టిరెడ్డిపల్లె గ్రామ సమీపంలోని పొలాల్లో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు..మండలంలోని పి.పాట్టిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మారంరెడ్డి బాబుల్‌రెడ్డి (28) మారంరెడ్డి బాలిరెడ్డి పొలాన్ని కౌలుకు తీసుకుని శనగ పంట సాగుచేశాడు. మంగళవారం బాబుల్‌రెడ్డి పొలానికి వచ్చి మోటార్‌ను రిపేరు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఎ.సుబ్బరాజు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. మృతుని సోదరుడు ఆంజనేయరెడ్డి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సుబ్బరాజు తెలిపారు.

17న కుష్టు వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య శిబిరం

ఒంగోలు అర్బన్: కుష్టు వ్యాధిగ్రస్తులకు ఈ నెల 17వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్ తెలిపారు. శిబిరంలో పాల్గొనే వ్యాధిగ్రస్తులను క్షుణ్ణంగా పరీక్షించి అంగవైకల్యం ఉన్న రోగులకు ప్లాస్టిక్ సర్జరీ ద్వారా డిఫామిటీ కరెక్షన్ ఆపరేషన్ చేస్తామని పేర్కొన్నారు. చర్మవ్యాధులు, జనరల్‌సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, కుష్టు నియంత్రణ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని ఏపీఎంఓ, డీపీఎంఓలు వ్యాధిగ్రస్తులను చైతన్య పరచాలన్నారు. ఈ అవకాశాన్ని వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫ్లెక్సీ తొలగిస్తూ యువకుడు మృతి

- కొడుకు మృతితో అనాథగా మారిన తల్లి



అహరోను (ఫైల్)

కారంచేడు: వృద్ధాప్యంలో అండగా ఉంటాడనుకున్న కొడుకు ప్రమాదవశాత్తు కన్నుమూశాడు. దీంతో ఆ తల్లి ఆవేదనతో రోదిస్తున్న తీరు చూపరులను కంట తడి పెట్టించింది. వివరాల్లోకి వెళితే మండలంలోని స్వర్ణ సచివాలయం–1 సమీపంలోని ఎస్సీ కాలనీకి చెందిన మట్టె అహరోను (19) మంగళవారం ఫ్లెక్సీని తొలగించే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాలనీలో ఇటీవల ఒక వివాహం జరిగింది. ఈ వివాహానికి సంబంధించి వారి కుటుంబ సభ్యులు ఒక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మంగళవారం అదే కాలనీకి చెందిన అహరోను, తన స్నేహితుడు సలగల బాబులు అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగిస్తున్నారు. ఫ్లెక్సీ బరువు ఉండటంతో సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. దీంతో ఒక్క సారిగా విద్యుదాఘాతానికి గురయ్యారు. అహరోను అపస్మారక స్థితికి వెళ్లాడు. 108 సిబ్బంది వచ్చి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సలగల బాబుకు కూడా రెండు చేతులు కాలిపోయాయి. బాబును చీరాల ఆసుపత్రికి తరలించారు. అహరోను తండ్రి మృతి చెందగా, అక్కకు వివాహం జరిపించారు. తల్లి, కొడుకు మాత్రమే ఇంట్లో ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. మృతుడు డిగ్రీ చదువుతున్నాడని చెప్పారు. ఖాళీ సమయంలో తను కూడా వ్యవసాయ పనులకు వెళ్ల తల్లికి చేదోడు వాదోడుగా ఉంటాడని, కొడుకు మృతితో తల్లి అనాథగా మిగిలిందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఇక తనకు దిక్కెవరని తల్లి రోదనలతో ఆ ప్రాంతమంతా విషాదఛాయలు అలముకున్నాయి.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వీరాస్వామి

చినగంజాం: భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగా ఓ వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతిచెందాడు. ఈఘటన మంగళవారం ఇంకొల్లు మండలం ఇడుపులుపాడు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎస్‌కే నాయబ్ రసూల్ వివరాల మేరకు.. మండలంలోని గ్రామానికి చెందిన గుంజి వీరాస్వామి (35) తన ఇంటిలో ఉరివేసుకొని అనుమానాస్పదంగా మరణించినట్లు తండ్రి గుంజి నాగేశ్వరరావు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వీరాస్వామి 12 ఏళ్ల క్రితం ద్రోణాదుల గ్రామానికి చెందిన లక్ష్మితో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపాడు. గత నెల రోజుల నుంచి భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగా విడిగా ఉంటున్నట్లు చెప్పారు. మంగళవారం ఇంట్లో ఉరేసుకొని రక్తపు మడుగులో ఉన్నాడని, తన మనవరాలు వచ్చి చెప్పిందన్నాడు. తాను వెళ్లి చూసి మృతుడిని ఉరి నుంచి దింపినట్లు, అతని మృతిపై అనుమానం ఉందని తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.